
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.8
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శనివారం 28 సెప్టెంబరు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగుల్లో)		(క్యూసెక్కుల్లో)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.60 (308.4658)	32,292	43,972
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644 (4.29)	3,830.18	4,817.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.34 (44.74)	32,115	52,069



వరుసగా నాలుగేళ్లుగా రైతులకు పత్తిసాగు కలిసి రావడం లేదు. ఒక సంవత్సరం పత్తి దెబ్బ తింటే మరో సంవత్సరం కలిసొస్తుందని, ముంచినా, తేల్చినా పత్తి సాగేనన్నది రైతుల నమ్మకం. ఆ నమ్మకంతోనే రైతులు ప్రతియేటా పత్తి సాగు చేస్తున్నారు. అదీకాక యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులు నీరుంటే వరి, లేదంటే మెట్ట పంటగా పత్తి సాగు చేస్తున్నారు. మూడో స్థానంలో కంది సాగవుతుండగా, మిగతా పంటల సాగు నామమాత్రమే.

- మోత్కూరు

పత్తికి తెగుళ్లతో రైతు బేజార్

- ఎర్రబారుతున్న పత్తిచేలు
- పురుగు మందుల పిచికారితో పెరుగుతున్న ఖర్చు
- అదును తప్పిన వానలతో తగ్గిన పత్తి దిగుబడి
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- ఆందోళనలో పత్తి రైతులు

గత సంవత్సరం అదును తప్పిన వర్షాల కారణంగా పత్తి దిగుబడి తగ్గి, ధర కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో రైతులు నష్టపోయి అప్పులపాలయ్యారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఉందంటున్నారు. మైల (మొదటి దఫా) పత్తి అయినా ఏరకుండానే పత్తి చేలు జాజు రోగంతో ఎర్రబారుతున్నాయి.

అదును తప్పిన వానలతో..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,00,461 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. అదును తప్పిన వానలతో జిల్లాలో కొన్ని చోట్ల పత్తి చేలు ఎత్తు పెరగలేదు. మరికొన్ని చోట్ల మనిషి ఎత్తుకు పైగా పెరిగి ఇటీవలి వర్షాలకు నేల కొరిగాయి. జూలైలో భారీ వర్షాల్లేక ఎర్ర, దుబ్బ నేలల్లో పత్తి చేలు ఎత్తు పెరగకుండా కుంటుపడ్డాయి. నల్లరేగడి నేలల్లో బాగానే ఎదిగాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు ఆగస్టులో పత్తి చేలల్లో పూత వచ్చింది. ఆగస్టులో వర్షాల్లేక చేలు వాడిపోయాయి. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు గూడ (పూత) రాలింది. మళ్లీ ఇటీవల కురిసిన వర్షాలకు పగిలిన పత్తి తడిసింది. ఎత్తు ఎక్కువగా పెరిగిన చేలు నెలకొరిగాయి. ఆ చేలల్లో పగిలి పత్తి ఏరుకోవడం కూడా కూలీలకు కష్టంగా మారింది.

పంట మార్పిడి చేయక పోవడమూ కారణమే..

రైతులు తమకు ఉన్న కొద్దిపాటి భూమిలో పత్తి అయితేనే లాభపడతామని ప్రతీ సంవత్సరం పత్తినే సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేయకపోవడంతో తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. దీనికితోడు రైతులు వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోకుండా ఓ రైతు పిచికారీ చేశాడని, మరో రైతు హైడోస్ పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారని, దీంతో ఖర్చు పెరుగుతుందంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు ఇలా

జిల్లా	పత్తిసాగు విస్తీర్ణం(ఎకరాల్లో)
నల్లగొండ	5,40,022
సూర్యాపేట	78,094
యాదాద్రి	1,00,461

పంటకు అయ్యే ఖర్చు

పత్తి ఏరడానికి ఖర్చు (ఎకరాకు)	రూ.1800
రవాణా ఖర్చులు	రూ.9వేలు
సాగు పెట్టుబడి	రూ.25వేలు
మొత్తం	రూ.34వేలు

రైతుకు మిగిలే నష్టం

పత్తి క్వింటాకు	రూ.6500
ఐదు క్వింటాళ్లకు	రూ.32,500
ఎకరాకు నష్టం	రూ.1500
కౌలు రైతుకు నష్టం	రూ.6వేలు

ప్రారంభం కాని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు



ఈ నెల మొదటి వారం నుంచే పత్తి తీత ప్రారంభమైంది. ఇప్పటివరకు ప్రభుత్వం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పొడుగు పింజ పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7521 ఉండగా ఈ నెల మొదట్లో ప్రైవేటు వ్యాపారులు క్వింటాకు రూ.6,800 నుంచి రూ.ఏడు వేల వరకు కొన్నారు. ఇప్పుడు ధర తగ్గించారు. క్వింటాకు రూ.5,500 నుంచి రూ.6,500 లకే కొంటున్నారంటున్నారు. ప్రభుత్వం వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు పత్తి కొనాలని పత్తి రైతులు కోరుతున్నారు.

పెట్టుబడైనా చేతికి వచ్చేలా లేదు

ఆరుగాలం కష్టపడి పత్తి పండిస్తే కనీసం పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా లేదంటున్నారు. గతంలో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఇప్పుడు తెగుళ్ల కారణంగా ఎకరాకు ఐదారు క్వింటాళ్ల దిగుబడి అయినా వచ్చేలా లేదంటున్నారు. ఎకరా పత్తి సాగుకు సుమారు రూ.25వేలు ఖర్చవుతుంది. కౌలు రైతులైతే ఎకరాకు మరో రూ.ఐదారు వేలు కౌలు ఖర్చు అదనం. పత్తి ఏరడానికి కూలీలకు, పత్తిని మిల్లు వద్దకు తీసుకెళ్లడానికి క్వింటాకు సుమా రు రూ.1800 ఖర్చవుతుంది. సగటున ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చినా పత్తి ఏరడానికి, విక్రయానికి తీసుకెళ్లడానికి రవా ణా ఖర్చులు కలిపి ఎకరాకు రూ.9వేలు, సాగు పెట్టుబడి రూ.25వేలు కలిపి మొత్తం రూ.34వేలు ఖర్చవుతుంది. పత్తి క్వింటాకు రూ.6,500 విక్రయిస్తే ఐదు క్వింటాళ్లకు రూ.32,500 వస్తాయి. ఎకరాకు రూ.1,500 న ష్టం. కౌలు రైతు అయితే మరో రూ.ఆరువేలు మొత్తం రూ.7,500నష్టం వస్తుందంటున్నారు. ధర పెరిగితేనే పెట్టుబడిచేతికొస్తుందంటున్నారు.

జాజు రోగం తగిలింది



నాకు ఉన్న రెండెకరాలకు తోడు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు గూడ రాలింది. ఇటీవల కురిసిన వర్షాలకు జాజు రోగం తగిలి పత్తి ఎర్రబారుతుంది. మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. గతంలో ఎకరాకు పదిపన్నెండు క్వింటాళ్ల దిగబడి వచ్చేది. ఈ సారి 4,5క్వింటాళ్ల దిగుబడి అయినా వచ్చేలా లేదు.

- కొండ సోమల్లు, పత్తి రైతు, కొండగడప

13-0-45 పిచికారీ చేయాలి



మోత్కూరు మండలంలో పత్తికి జాజు తెగులు సోకి ఎర్రబారుతుంది. వర్షాలు వరుసగా కురవడంతో చేలల్లో నీరు నిలిచి, మెగ్నీషియం, ఇతర పోషకాలు మొక్కలకు అందక జాజు రోగం వచ్చింది. జాజు తెగులు నివారణకు 13-0-45 పౌడర్, ఫార్ములా-4, ఫార్ములా- 6 వేర్వేరుగా పిచికారీ చేయాలి.

- ఎం.అశోక్‌కుమార్, ఏఈవో, మోత్కూరు

దెబ్బతిన్న పత్తి చేలు

బీటీ పత్తిసాగుతో కాయతొలుచు పురుగు అదుపులో ఉంటున్నా కొన్ని రోజులు వర్షాలు కురియక చేలు వాడిపోవడం, ఆ తర్వాత వరుసగా నాలుగైదు రోజులు వర్షాలు కురవడంతో పత్తి చేలు దెబ్బతిన్నాయి. గూడ రాలింది. ఉన్న కాయలు పగిలినా ఏరుకునే పరిస్థితి లేకుండా ఇటీవల వర్షాలు కురవడంతో చేనుపై ఉన్న పత్తి తడిసింది. అధిక వానలతో నేలలు జాలువారి మొక్కలకు పోషకాలు అందక జాజు రోగం తగిలి పత్తి చేలు ఎర్రబారాయి. జాజు రోగం తగలగానే అప్పటికీ వచ్చిన కాయ పగిలి చెట్టు ఎండిపోతుంది.దీంతో దిగుబడి బాగా తగ్గిపోతున్నది. గతంలో రెండు మూడు పర్యాయాలు పత్తి ఏరిన తర్వాత జాజు రోగం తగిలేది. ఈ సారి మొదటి దఫా పత్తి ఏరకుండానే చేలకు జాజు రోగం తగిలి ఎర్రబారాయి. యేడాదికేడాది పెట్టుబడి ఖర్చులు పెరుగుతుండగా, దిగుబడి తగ్గుతుండటంతో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలవుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కూడా ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోతే మరింత నష్టం వాటిల్లుతుందంటున్నారు.



సన్నాల సాగుపై ఆసక్తి

- ఈ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్
- జిల్లాలో 2,68,785ఎకరాల్లో సన్నాల సాగు
- అక్టోబర్ మొదటి వారంలో కొనుగోలు ప్రారంభం..?



ఈ సీజన్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సన్న రకాల ధాన్యానికి బోనస్ చెల్లించేందుకు ఈ నిర్ణయి తీసుకుంది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా సన్న ధాన్యానికి బోనస్ వర్తింపజేయనున్నారు. అయితే రైతులందరూ దొడ్డు, సన్న రకంతో పాటు ఇతరరకాలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రాబోయే రోజుల్లో రేషన్ దుకాణాల ద్వా రా సన్న బియ్యాన్ని పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. అంటే తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా సన్న రకాల సాగుకు ప్రోత్సాహం కల్పించాలని ప్రభుత్వం యోచించి ఆదిశగా సన్న రకాలను ప్రోత్సహిస్తుంది.


- నల్లగొండ

7లో

జీతాల్లేక 'ఆపరేటర్ల' పరేషాన్

ఆర్థిక ఇబ్బందుల్లో వేతన జీవులు

ఎనిమిది నెలలుగా అందని వేతనాలు



జీతాల్లేక ధరణి ఆపరేటర్లు పరేషాన్ అవుతున్నారు. ఎనిమిది నెలలుగా జీతాలు అందకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు అందక, నెలవారీ ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్న తమపై బదిలీ పిడుగు వేశారని ఆరోపించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, భూ సంబంధిత ఫిర్యాదుల టెక్నికల్ పరిష్కారాలు, ఎన్నికల విధులు, ప్రజాపాలన దరఖాస్తులతోపాటు తహసీల్దార్ కేటాయించే ఇతర విధులను కూడా నిర్వర్తిస్తూ బారెడు పనికి మూరెడు జీతంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని కుమిలిపోతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం నుంచి ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.29,500 వేతనంగా ప్రైవేటు ఏజెన్సీకి చెల్లిస్తున్నప్పటికీ రూ. 12,031 మాత్రమే ఉద్యోగులకు అందుతున్నాయి. సదరు ఏజెన్సీ గడువు కూడా గత మే నెలలో ముగియడంతో ఇప్పటివరకు వీరి బాధ్యత మరో ఏజెన్సీకి అప్పగించకపోవడంతో జీతాల చెల్లింపుల్లో జాప్యమవుతోంది.

- మిర్యాలగూడ

7లో

లక్ష్మణ్‌బాపూజీ ఉద్యమ సేవలు

మరువలేనివి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

భువనగిరి (కలెక్టరేట్) సెప్టెంబరు 27: మలిదశ తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధనకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్‌బాపూజీ 109వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఆచార్య లక్ష్మణ్‌బాపూజీ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికోసం ఎంతో పాటుపడ్డారని చెప్పారు. బాపూజీని మార్గదర్శకంగా తీసుకొని, అందరూ ముందుకు వెళ్లాలని సూచించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచి సామాజిక న్యాయం, క్రమశిక్షణ, దృఢసంకల్పం కలిగిన వ్యక్తి బాపూజీ అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, బీసీ కులాల సంక్షేమ అధికారి పి.యాదయ్య, వివిధ సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య, నర్సింహ, అశోక్, బాబురావు, వెంకటేశం, శ్రీరాం, సత్తయ్య, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రషర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

ప్రజాపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సీస శ్రీనివాస్

భువనగిరి (కలెక్టరేట్), బొమ్మలరామారం, సెప్టెంబరు 27: క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న స్టోన్ క్రషర్లపై చర్యలు చేపట్టాలని ప్రజాపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సీస శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొమ్మలరామారం మండలం కేంద్రంతోపాటు రామలింగంపల్లి, పెద్దపర్వతాపురం, తిరుమలగిరి, నాగినేనిపల్లి, మర్యాల గ్రామాల్లో పుట్టగొడుగుల్లా స్టోన్ క్రషర్లు వెలిశాయన్నారు. వీటి ద్వారా భారీ శబ్దాలతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతుండగా ఇళ్లు ధ్వంసమవుతున్నాయని ఆరోపించారు. బోరుబావులు పేలుళ్ల దాటికి పూడుకుపోతుండటంతో వ్యవసాయం పూర్తి కుంటుపడిందన్నారు. అనుమతి ఒక చోట తవ్వకాలు మరోచోట చేయడంతో నిబంధనలు యథేచ్ఛగా అతిక్రమిస్తున్నారని తెలిపారు. మూడు వేబిల్లులు తీసుకొని 30 టన్నుల రవాణచేస్తూ ఖనిజ సంపదను లూటీ చేస్తున్నారని చెప్పారు. వంద అడుగుల కంటే ఎక్కువ లోతులో రాయి తవ్వుతూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నాయన్నారు. పేలుళ్లకు నిర్దిష్ట సమయం లేకపోవడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు సుదర్శన్, జంగయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కలిసిన టీజీవోలు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 27: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో తీవ్ర నిధుల కొరతపై కలెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. కార్యదర్శులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పర్వదినాల సందర్భంగా పంచాయతీలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఖర్చు చేసిన నగదుకు సంబంధించిన చెక్కులు విడుదల కాలేదన్నారు. పంచాయతీ పెండింగ్ బిల్లులు విడుదల చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీజీవోల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్‌ప్రసాద్, శ్రీనివాస్, నేతలు కవిత, హరిక్రిష్ణ, సైదులు, చంద్రారెడ్డి, సబిత తదితరులు పాల్గొన్నారు.

రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా వాహనాల ద్వారా వచ్చే కాలుష్యాన్ని తగ్గించాలని భావించింది. ఇప్పటికే డీజిల్ వాహనాల తయారీ తగ్గింది. మార్కెట్‌లోకి ఎల్‌పీజీ, సీఎన్‌జీ, విద్యుత్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ కాలుష్యం మాత్రం తగ్గడం లేదు. అందుకోసం పాత వాహనాలను నియంత్రించాలని ఆలోచన చేస్తున్నారు. అందుకోసం రాష్ట్రంలో 15 ఏళ్లు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు చర్యలు చేపట్టబోతున్నారు. ఇందుకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలన చేస్తున్నట్లు సమాచారం.

- సూర్యాపేటక్రైం



1,65,619 వాహనాలు తుక్కుకే



- కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వ ఆలోచన
- పదిహేను ఏళ్లు పైబడిన వాహనాలపై తుక్కు చేసేందుకు నిర్ణయం
- నూతన వాహనాలు కొనుగోలు చేస్తే 10శాతం రాయితీ
- త్వరలో అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 1.65లక్షల పాత వాహనాలు

పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ముఖ్యంగా పాత వాహనాలతో కాలుష్యం ఎక్కువగా వస్తుంది. దీంతో ప్రజలకు వివిధ రకాల వ్యాధులు వస్తున్నాయి. దానిని నియంత్రించేందుకు 15 ఏళ్లు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చనున్నారు. సంబంధిత వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించి తుక్కుగా మార్చేందుకు రవాణాశాఖకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అనంతరం వాహనాన్ని తుక్కుగా మార్చేందుకు అనుమతులిస్తారు. వాహనం ఇంజిన్, ఛాసిస్ నెంబరును తొలగిస్తా రు. అనంతరం తుక్కుగా మార్చేందుకు ఒప్పం దం కుదుర్చుకున్న కంపెనీలకు ఆ వాహనాన్ని అప్పగించనున్నారు. అనంతరం వాహన యజమానికి సర్టిఫికెట్‌ను అందజేస్తారు. దీంతోపాటు వాహనం తుక్కుగా మారినందున వాహనం యొక్క ఇనుముకు విలువ కట్టి, ఆ డబ్బులను వాహన యజమానికి అందజేస్తారు. వాహన యజమాని ఎప్పుడైనా నూతన వాహనం కొనుగోలు చేసినప్పుడు సంబంధిత సర్టిఫికెట్ చూపిస్తే నూతన వాహనం ధరలో 10 శాతం రాయితీ ఇచ్చే అవకాశాలున్నాయి. పాత

కాలుష్యంతో పాటు నేరాల కట్టడి

పాత వాహనాలను తుక్కుగా మార్చడం వల్ల కాలుష్యంతోపాటు నేరాలను కూడా కట్టడి చేసే అవకాశం లేకపోలేదు. కొంతమంది పాత వాహనాలను వినియోగిస్తూ నేరాలకు పాల్పడుతున్నారు. వాహనాలను కొనుగోలు చేసిన వారు పాత వాహనంకావడంతో వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదు. దీంతో వాహనం విక్రయించిన వ్యక్తి పేరున వాహనం రిజిస్ట్రేషన్ ఉంటుంది. ఈ విధంగా ఒక్కో పాత వాహనం ముగ్గురి నుంచి నలుగురు వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో నేరస్తులు పాత వాహనాలపై తిరుగుతూ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ వాహన నెంబరు ఆధారంగా నేరస్తులను పట్టుకోవడం ఇబ్బందిగా మారింది. నూతన నిబంధన అమల్లోకి వస్తే ఇలాంటి సంఘటనలు జరిగే అవకాశం ఉండదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం



15 ఏళ్లు పైబడిన వాహనాలను తుక్కుగా మార్చే విషయంలో ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే అమలు చేస్తాం. ఆదేశాలు వచ్చిన తర్వాత గడువు తీరిన వాహనాలు రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తాం. సంబంధిత వాహన యజమానికి జరిమానా విధించే అవకాశం ఉంటుంది. పాత వాహనాలతో కాలుష్యం ఎక్కువగా వస్తుంది.

- సురేష్‌రెడ్డి, డీటీవో, సూర్యాపేట

వాహనాలను తుక్కుగా మార్చేందుకు పలు ప్రముఖ కంపెనీలు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఇప్పటికే ఈ పద్ధతిని అమలు చేస్తున్న మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ ఉన్నతాధికారులు పర్యటించి అధ్యయనం చేసినట్లు సమాచారం.



ఉమ్మడి జిల్లాలో వాహనాలు ఇలా..

జిల్లా	మొత్తం వాహనాలు
యాదాద్రి	2,31362
సూర్యాపేట	2,98,887
నల్లగొండ	6,77,997
మొత్తం	12,08,246

15 ఏళ్లుపైబడిన వాహనాలు

ద్విచక్రవాహనాలు	1,32,707
కార్లు	12,032
ఆటోలు	9864
గూడ్స్‌వాహనాలు	7278
ట్రాక్టర్లు	3738
మొత్తం	1,65,619

భువనగిరి ఖిల్లా.. తెలంగాణకు ఆణిముత్యం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఉత్సాహంగా పర్యాటక, యువజనోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

భువనగిరి టౌన్, సెప్టెంబరు 27: త్వరలో భువనగిరి ఖి ల్లా తెలంగాణకు ఆణిముత్యం కానున్నదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం భువనగిరి ఖిల్లా వద్ద నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవం, జాతీయ యువజనోత్సవా ల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు హైదరాబాద్ నగర అభివృద్ధి ఒకవైపునే జరిగిందని, త్వరలోనే నగరానికి వెలుపల ఉన్న భువనగిరి వైపు అభివృద్ధి జరుగుతుందన్నారు. దీంతో యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి సమీపంలో ఉండడం, త్వరలోనే భువనగిరి ఖిల్లాపై తెలంగాణలోనే మొట్ట మొదటి రోప్‌వే నిర్మాణం కానుండటం, పూర్తిస్థాయి అభివృద్ధి పనులు జరుగనుండడంతో హైదరాబాద్ అభివృద్ధి త్వరలోనే భువనగిరి వైపునకు రానున్నదన్నారు. పర్వతారోహణ శిక్షణతో ప్రపంచంలోనే భువనగిరి ఖిల్లా పేరుగాంచిందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అనతి కాలంలోనే గణనీయ ప్రగతి సాధించిన తెలంగాణ ప్రగతి వైపు దూసుకెళుతోందన్నారు. స్వస్థలమైన భువనగిరి అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పురావస్తు శాఖ అదనపు సంచాలకులు నాగలక్ష్మి, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ధనాంజనేయులు, పర్వతారోహకురాలు పడమటి అన్విత, సద్ది వెంకట్‌రెడ్డి, దిడ్డి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్: విజ్ఞానాన్ని పంచి సమాజంలో వెలుగులు నింపే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. యాదగిరిగుట్ట ఎంపీడీవో కార్యాలయంలో జేవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, యాదగిరిగుట్ట మున్సిపల్ కౌన్సిలర్ ముక్కర్ల మల్లేష్, పట్టణ ఇన్స్‌పెక్టర్ ఎం.రమేష్, శ్రీరామూర్తి పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ బెన్ షోలోమ్



ఫైళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షోలోమ్

ఆలేరు రూరల్, సెప్టెంబరు 27: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ బెన్ షో లోమ్ అన్నారు. శుక్రవారం ఆలేరు తహసీల్దార్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మీసేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవా కేంద్రాలు వినియోగదారుల నుంచి ఎలాంటి అధిక మొత్తాలు వసూలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల విషయమై రోజువారి లక్ష్యం ఏర్పాటు చేసుకొని పూర్తి చేయాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను వారం రోజుల్లోనే పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ధరణి ఎంతగానో ఉపయోగపడుతుందని, రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ పూర్ణచందర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గొర్రెలు, కోళ్ల పెంపకానికి 50 శాతం సబ్సిడీతో రుణాలు

- డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వివరాలు 7లో..

ఎక్సైజ్ అధికారుల దాడులు

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబరు 27: హుజూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం నియోజకవర్గంలోని పలుచోట్ల దాడులు నిర్వహించారు. మఠంపల్లి మండలం కొత్తతండాకు చెందిన బాణోత్ లక్యా, శైలజ మోటార్ సైకిల్‌పై 7లీటర్ల సారాను తరలిస్తుండా మీగడంపాడు వద్ద పట్టుకున్నారు. అనంతరం పాలకవీడు మండలం కల్మెట్‌తండాకు చెందిన రూపావత్ బద్యా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై 8 లీటర్ల సారా తరలిస్తుండగా వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు తెలిపారు.

సంక్షోభంలో ప్రజారోగ్యం

● తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

మిర్యాలగూడ, సెప్టెంబరు 27: మానవ సంబంధాలతో పాటు ప్రజారోగ్యమూ సంక్షోభంలో పడిందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుడు కస్తూరి మల్లయ్య సంస్మరణ సందర్భంగా నిర్వహించిన 'సంక్షోభంలో మానవ సంబంధాలు' సెమినార్‌కు ఆయన హాజరై మాట్లాడారు. మానవ సంబంధాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జ్ఞానం ఎంత ఉన్నా అనుభవం కంటే తక్కువే అన్నది తన అభిప్రాయమని తెలిపారు. విధులను వదిలి రియల్ ఎస్టేట్ భూములకు అతుక్కుపోతున్న మనుషుల్ని తిరిగి వారి స్థానాల్లో కూర్చోబెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా సంఘాల కన్వీనర్ బీసం రామయ్య మాట్లాడుతూ మానవ సంబంధాల సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా బుద్ధి జీవులు ముందుకు సాగాలని అన్నారు. ఆర్థిక సంబంధాల నుంచి మనిషి ఎంత విముక్తుడైతే మానవ సంబంధాలు అంతగా బలపడతాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, డీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు, ఉదయ, సింగర్‌బాబా, తిరుమలరావు, కస్తూరి మల్లయ్య కుమారులు సోమయ్య, సత్యనారాయణ, ప్రభాకర్, వెంకట్, కుమారస్వామి, రవి, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 27: పాముకాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గుంటూరు వెంకటయ్య (58) పని నిమిత్తం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. పొలం వద్ద పాముకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడు వెంకటయ్యకు భార్య, ఇద్దకు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

588.80 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 27: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 588.80 అడుగులుగా ఉంది. ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 32,292 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 588.60 అడుగులుగా (308.4658టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10,500 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5297 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,375 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తంగా 43,972 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

'మూసీ'కి నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వారం రోజులుగా ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఈ నెల 24వ తేదీన 3 గేట్ల నుంచి, 25వ తేదీన 3గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేయగా, గురువారం ఒక గేటు పెంచి నాలుగు గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. శుక్రవారం 3,830.18 క్యూసెక్కుల వరద రావడంతో నాలుగు గేట్ల నుంచి 4,552.40 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 264.82 క్యూసెక్కులు మొత్తం 4,817.22 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. 645 అడుగుల(4.46టీఎంసీ) నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.65 అడుగులుగా(3.99టీఎంసీ) ఉంది. రెండో విడతగా కుడి కాల్వకు 48.15 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 216.67 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

'పులిచింతల' 2 గేట్ల నుంచి నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఒక గేటు నుంచి నీటి విడుదల చేస్తుండగా, 25వ తేదీన ఒక గేటు ఎత్తి రెండు గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. 26వ తేదీన ఒక గేటు దించి ఒక గేటను నుంచి నీటి విడుదల చేయగా, శుక్రవారం మరొక గేటు ఎత్తి మొత్తం రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 174.34 అడుగులు (44.74 టీఎంసీలుగా) నమోదైంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 32,115 క్యూసెక్కులు వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. శుక్రవారం రెండు గేట్లను ఎత్తి 39,069 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 110మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తూ మొత్తం 52,069 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రైతుల అభివృద్ధి కోసం కోనం ఫౌండేషన్ కృషి

కట్టంగూరు, సెప్టెంబరు 27: రైతుల అభివృద్ధి కోసం కోనం ఫౌండేషన్ కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు కోనం సందీప్ అన్నారు. ఇండియన్ మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ ఆధ్వర్యంలో ఇండియన్ కోఆపరేషన్ విభాగం నిర్వహిస్తున్న మేనేజ్ కార్యక్రమంలో భాగంగా ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ ప్రైవేట్ పార్టన ర్ షిప్ ఇన్ అగ్రికల్చర్ అలైడ్ సెక్టార్స్ కింద వివిధ దేశాలకు చెందిన 29మంది అంతర్జాతీయ శిక్షణ అధికారులు పర్యటించారు. శుక్రవారం మండలంలోని రంగారెడ్డిగూడెం వద్ద గల రైతు ఉత్పత్తిదారుల కం పెనీ లిమిటెడ్ సంస్థను కోనం ఫౌండేషన్ సభ్యులు వివిధ దేశాలకు చెందిన అంతర్జాతీయ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కోనం ఫౌండేషన్ సంస్థ చైర్మన్ సందీప్ మాట్లాడుతూ వ్యవసాయరంగంలో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కారం చూపుతూ రైతులు అ ధిక దిగుబడి సాధించేలా తమ సంస్థ చేయూతనిస్తుందన్నారు. 29 దే శాలకు చెందిన అధికార వ్యవసాయ మంత్రి వర్గ ప్రతినిధులతో ఎఫ్‌పీవోను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు తమ ఉత్పత్తులను నేరుగా విక్రయించుకునేందుకు తాము సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సలహాదారుడు నంద్యాల నర్సింహారెడ్డి, చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఎం.శ్రీకాంత్, బి.రమేష్, లింగారెడ్డి, మహేష్, అంజి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు బాధితురాలికి అందజేత

నల్లగొండ, సెప్టెంబరు 27: పోగొట్టుకున్న బ్యాగు బాధితురాలికి అందజేసి వ్యక్తి తన నిజాయితీ చాటుకున్నాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సావర్కర్‌నగర్‌కు చెందిన గోగీకర్ పద్మావతి పట్టణంలోని ప్రకాశంబజార్‌లోని ఓ బేకరీకి వచ్చి బ్యాంకుకు వెళ్లింది. ఆ సమయంలో తన బ్యాగును పడిపోయినా ఆమె గమనించకుండానే వెళ్లిపోయింది. అదే సమయంలో దానిని గమనించిన సాయి ఆర్టికల్స్ షాప్ యజమాని బిక్షల యాదగిరి తన షాపునకు వచ్చిన కస్టమర్ సహాయంతో బ్యాగును భద్రపర్చాడు. బాధితురాలు ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాగ్ చూసుకుని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించింది. సీఐ రాజశేఖర్‌రెడ్డి వెంటనే క్రైమ్ సిబ్బంది శ్రీకాంత్‌ను పంపి సీసీటీవీ ఫుటేజీ పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. సాయి ఆర్టికల్స్ షాప్ యజమాని యాదగిరి భద్రపరిచిన బ్యాగును బాధితురాలికి చూపించారు. బాధితురాలు పద్మావతి అందులోని నగదు, బంగారం చూసుకొని సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ బాధితురాలికి బ్యాగును అందజేయడంతో పాటు ఆర్టికల్ షాప్ యజమాని యాదగిరిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

గొర్రెలు, కోళ్ల పెంపకానికి

50 శాతం సబ్సిడీతో రుణాలు

● జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నాగార్జునసాగర్, సెప్టెంబరు 27: గొర్రెలు, కోళ్ల పెంపకం యూనిట్ల కోసం రైతులకు 50 శాతం సబ్సిడీతో రుణాలు అందజేయడానికి కొత్తగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకాన్ని ప్రవేశపెట్టినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథిగృహం బోర్డు రూంలో నిర్వహించిన ఎన్‌డీసీసీబీ పాలకవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో నూతనంగా సంస్థాన్‌నారాయణపురం, తిప్పర్తి, గరిడేపల్లి, దామరచర్ల, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రాల్లో ఐదు కొత్త బ్యాంకులు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే నేషనల్ హార్టికల్చర్ బోర్డు కింద పండ్ల తోటల పెంపకం కోసం, కూరగాయల సాగు కోసం 30శాతం సబ్సిడీతో రూ.30లక్షల వరకు రుణాలు మంజూరు చేయడానికి తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు టర్నోవర్ రూ. 3వేల కోట్లు కాగా లాభాలను రూ.50 కోట్లకు పెంచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఏసీరెడ్డి దయాకర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో శంకర్‌రావు, బ్యాంకు డైరెక్టర్లు, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం


అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 27: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్రరీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేద మంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధాన ఆలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలో అద్దాల మండపం ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమన రీతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 8,48,431 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. సంగీత సభల్లో భాగంగా కొండపైన సాయంత్రం కావ్యాంజలి డ్యాన్స్ అకాడమీ, అనంతరం నూపుర డ్యాన్స్ అకాడమీ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సాగర్‌లో పర్యాటలకుల సందడి


సాగర్‌లో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 27: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఎన్.ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో శుక్రవారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ హిల్‌కాలనీలో విజయవిహార్ అతిథి గృహం వద్ద పర్యాటకులను ఆకట్టుకునే విధంగా టూరిజం అండ్ పీస్ అనే నినాదంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయాలైె బతుకమ్మ, కోలాటం, లంబాడాల నృత్యాలు చేశారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. విజయవిహార్ అతిథి గృహాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో విజయవిహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, లాంచీస్టేషన్ మేనేజర్ హరి, సూపర్‌వైజర్ శ్రీధర్, సిబ్బంది సత్యనారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఔషధాల సీజ్


ఔషధాలను సీజ్ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విన్‌కుమార్

మోత్కూరు, జూలై 27: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెంలో ఆర్ఎంపీ డాక్టర్ పోలెబోయిన బిక్షపతి ఇంట్లో లైసెన్సు లేకుండా నిల్వ చేసిన సుమారు రూ.30 వేల విలువైన కలిగిన 26 రకాల మందులు (ఔషధాలను) శుక్రవారం సీజ్ చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె.అశ్విన్‌కుమార్ తెలిపారు. లైసెన్సు లేకుండా మందులు నిల్వ చేసిన భిక్షపతిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. సీజ్ చేసిన మందులను రామన్నపేట కోర్టులో అప్పగించామన్నారు. లైసెన్సు లేకుండా మందులు నిల్వ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రూ. 100 కొట్టు.. మేకను పట్టు

● చౌటుప్పల్‌లో యువత దసరా ఆఫర్ ● శాంతిభద్రతల సమస్యపై చర్చనీయాంశం

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 27: దసరా పండుగకు అవసరమయ్యే వస్తువులకు రూ.100 కొట్టు మేకను పట్టు ఆఫర్‌తో పెట్టిన లక్కీ డ్రా చౌటుప్పల్ మునిసిపాలిటీలో ఆసక్తికరంగా మారింది. మునిసిపాలిటీలోని తాళ్లసింగారంలోని కొంతమంది యువకులు ఈ కొత్త రకమైన లక్కీ డ్రాను ప్రవేశపెట్టడం తో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. దీనికి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్నారు. కూపన్ రూ.100 చెల్లించి కొనుగోలు చేసిన వ్యక్తులకు 5 బంపర్ ఆఫర్లు పెట్టారు. ఇది ఇలా ఉండగా, వ చ్చే నెల 10వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఈ లక్కీ డ్రా శాంతిభద్రతల సమస్యగా మారే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆ అర్చకుడు వద్దే వద్దు..


● పిల్లలమర్రిలో రసాభాస


పిల్లలమర్రి దేవాలయం ముందు గుమ్మికూడిన గ్రామస్థులు

సూర్యాపేట రూరల్, సెప్టెంబరు 27: దేవాలయానికి వచ్చే విరాళాల్లో అవినీతికి పాల్పడిన అర్చకుడు వద్దని గ్రామస్థులు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి శివాలయం ఎదుట కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీ నివాస్ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. రెండు నెలల క్రితం దేవాలయం నుంచి తొలగించిన పూజారి నందీశ్వర్‌శర్మను తిరిగి అర్చకునిగా తీసుకునేందుకు గ్రామ పెద్దలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చే శారు. గతాన్ని వదిలేసి ఒక అవకాశం ఇచ్చి చూడాలని గ్రామపెద్దలు పేర్కొనడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అర్చకుడు వద్దే వద్దని ఖరాఖండి తేల్చిచెప్పారు. పలు సమస్యలతో ఉన్న భక్తుల బలహీనతలను ఆసరాగా చేసుకుని లక్షల రూపాయలు వసూలు చేశారని గ్రామస్థులు ఆరోపించారు. మళ్లీ అవకాశం ఇస్తే ఇంకా వసూళ్లకు పాల్పడి ప్రమాదకరంగా మారతాడని గ్రామస్థులు ఆరోపించారు. సమావేశంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సన్నాల సాగుపై ఆసక్తి

» ఈ సీజన్ నుంచే సన్నాలకు రూ.500 బోనస్
» జిల్లాలో 2,68,785ఎకరాల్లో సాగు
» అక్టోబరు మొదటి వారంలో కొనుగోలు ప్రారంభం..?



నల్లగొండ, సెప్టెంబరు 27: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సన్నరకాల ధాన్యానికి బోనస్ చెల్లించేందుకు నిర్ణయించింది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను చెల్లించడానికి నిర్ణయం జరిగింది. రైతులకు మేలు చేసేలా బోనస్‌ను అందించాలన్నారు. అయితే రైతులందరూ దొడ్డు, సన్న రకంతో పాటు ఇతర రకాలకు బోనస్ ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం దొడ్డు రకానికి బోనస్ ఇవ్వడం లేదని ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో దొడ్డు రకం పండించే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొడ్డు, సన్న రకాలు మొత్తం 5,10,195 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో సన్న రకాలు 2,68,785 ఎకరాల్లో సాగు కాగా, దొడ్డు రకం 2,41,410 ఎకరాల్లో సాగు చేశారు. అంటే దొడ్డు, సన్న రకాలు 50 శాతం మేర సాగు అయ్యాయి. వాస్తవానికి అయితే దొడ్డు రకాలు అధికంగా దిగుబడి వస్తుండటంతో రైతులు ఆ వంతుగానే అధికంగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ముందే చెప్పడంతో ఈసారి వ్యవసాయ ప్రణాళికకు అనుగుణంగా దొడ్డు, సన్న రకాలు సమానంగా సాగు చేయడం విశేషం. రాబోయే రోజుల్లో రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి నుంచి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా సన్న రకాల సాగు ప్రోత్సాహం కల్పించాలని ప్రభుత్వం యోచించి ఆ దిశగా సన్న రకాలను ప్రోత్సహిస్తుంది.

5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి

సన్నరకాలు దిగుబడి జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వస్తుందని వ్యవసాయశాఖతో పాటు పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అంచనా వేస్తుంది. ప్రభుత్వం గతంలోనే 33 రకాల సన్నరకాల విత్తనాలను గుర్తించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. దొడ్డు రకాల బదులు సన్నరకాలను సాగు చేయాలని పేర్కొనడంతో పాటు 33 రకాలను గుర్తిస్తూ జూలై 4వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఆ వైపుగా వ్యవసాయ శాఖ రైతుల్లో చైతన్యం తేవడంతో జిల్లాలో 2,68,785 ఎకరాల్లో సన్నరకాలను సాగు చేశారు. దీంతో 5 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉంది. సన్నరకాలు పండించిన రైతులందరికీ క్వింటాల్‌కు రూ.500 బోనస్ రానున్నడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే దొడ్డు రకాలు పండించిన రైతులు మాత్రం తమకు కూడా బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టామని బోనస్ ఇస్తే గట్టు ఎక్కుతామని రైతులు పేర్కొంటున్నా ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటుంది. 33 రకాలను గుర్తించడంతో పాటు రైతులకు నచ్చిన సన్నరకాలను వేసుకోవాలంటూ ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులు నమ్మకమైన, దిగుబడి వచ్చే విత్తనాలను ఎంపిక చేసుకొని వేయడానికి ముందుకు అడుగులు వేశారు. ఎకరానికి ఏ మేరకు దిగుబడి వస్తుందనేది స్పష్టత రానుంది.

ప్రభుత్వ నిర్ణయం జరిగిన వెంటనే అమలు



ప్రభుత్వం సన్న రకాలకు రూ.500 బోనస్ ఇచ్చే అంశంపై ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే అమలు చేయడం జరుగుతుంది. జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్నరకం ధాన్యం దిగుబడులు రానున్నాయని అంచనా ఉంది. జిల్లాలో 2,68,785 ఎకరాల్లో సన్నరకం సాగు చేశారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు సన్నరకం పండించిన రైతులకు బోనస్ అందనుంది.

\- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

వచ్చే నెల మొదటి వారం నుంచి కొనుగోళ్లు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లను అక్టోబరు మొదటి వారం నుంచి చేయాలని ప్రభుత్వం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు తేదీ ఖరారు కాలేదు. అయినా అధికారులు ముందుగానే తూకం యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ఇంకా ఇతర ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జిల్లాలో 350 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఐకేపీతో పాటు పీఏసీఎస్ కేంద్రాలు, ఏఎంసీలలో ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశాలు ఉండటంతో ముందు జాగ్రత్తలు చేపట్టాలని ప్రభుత్వం పౌరసరఫరాల శాఖను ఆదేశించింది. ఇకపోతే సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్ల కోసం వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం కొనుగోళ్లు అక్టోబరు మొదటి వారంలో ప్రారంభమై జనవరి నెలాఖరు వరకు కొనసాగించాలని నిర్ణయించారు. నల్లగొండ జిల్లాలో తొలివారం ప్రారంభించాలని ప్రభుత్వం ఇప్పటికే సూచనప్రాయంగా నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా ఉండటంతో పాటు సౌకర్యాలు కల్పించడం కోసం ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం ఎగుమతి, దిగుమతి కోసం లారీలతో పాటు హమాలీల కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడానికి నిర్ణయించారు. ఇప్పటికే సమీక్షలు చేపట్టి ఆ వైపున అధికారులు అడుగులు వేస్తున్నారు.

నార్కట్‌పల్లిలో దసరా గుడిస్థలంపై వివాదం

» ఆ స్థలం మాదేనంటూ ఆర్టీసీ అభ్యంతరం
» వివాదాస్పద స్థలంలో మోహరించిన పోలీసులు
» స్థలం ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో సుఖాంతం
» రోజంతా నెలకొన్న ఉత్కంఠకు తెర


నార్కట్‌పల్లిలో వివాదాస్పదంగా మారిన దసరా గుడి స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న దసరా గుడి స్థలంపై మొదలైన వివాదం ఎట్టకేలకు సుఖాంతమైంది. గుడి స్థలం తమదేనని భీష్మించిన ఆర్టీసీ అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఆ స్థలంలోనే గుడి (కోట బురుజు) కట్టి తీరుతామని పట్టుబట్టిన గ్రామస్థులతో శుక్రవారం నార్కట్‌పల్లిలో తీవ్ర ఉత్కంఠ పరిస్థితులు ఏర్పడ్డాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అటు పోలీసులు, ఇటు ఆర్టీసీ భద్రతా విభాగం సిబ్బంది వివాదాస్పద స్థలం వద్ద మోహరించడంతో ఒకానొక పరిస్థితుల్లో ఎలాంటి ఉద్రిక్తతకు దారితీస్తుందోనన్న ఆందోళన కలిగింది. కానీ గ్రామస్థుల సంయమనం, పోలీసుల చొరవ, చర్చల ఫలితంగా స్థలం వివాదానికి చివరకు శాంతిమార్గంలోనే తెరపడింది. వివరాల్లోకి వెళితే.... నార్కట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆనుకునే పూర్వ జాతీయ రహదారివైపు దసరకా గుడి (కోటదిమ్మె) ఉండేది. సుమారు 70 ఏళ్ల నుంచి అక్కడే ప్రతీ సంవత్సరం దసరా పండుగను లాంఛనంగా ప్రారంభించే ఆచారం కొనసాగుతూ వస్తోంది. గుడి వేదికపై కనక దుర్గ, వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను కూడా నిర్వహిస్తూ ఉన్నారు. నార్కట్‌పల్లి పట్టణ సుందరీకరణలో భాగంగా చేపట్టిన రోడ్డు వెడల్పు కార్యక్రమంలో గుడిలో సగానికి పైగా తొలగించారు. మిగతా కొంత భాగాన్ని ఆర్టీసీ అధికారులు తొలగించి పక్కనే ఉన్న ఆర్టీసీ స్థలాన్ని కలుపుకొని ఖాళీ స్థలం కింద అద్దెకు ఇచ్చేందుకు చదును చేయించారు. ఆ క్రమంలో దసరా గుడికి సంబంధించిన ఆనవాళ్లు పూర్తిగా తొలగిపోయాయి. గ్రామస్థులు అభ్యంతరం చెప్పడంతో అప్పట్లో ఆ స్థలాన్ని టెండర్ ఇవ్వడాన్ని ఆర్టీసీ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఇదిలా ఉంటే వచ్చే నెల 2వ తేదీ నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో దసరా గుడి స్థలంలో కోట దిమ్మెను కట్టేందుకు గ్రామస్థులంతా కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీంతో ఆర్టీసీ అధికారులు వచ్చి అభ్యంతరం తెలిపారు. దసరా గుడికి గ్రామస్థులు చెబుతున్న స్థలం ఆర్టీసీదేనంటూ వాదించారు. ఆర్టీసీ అధికారుల వాదనను గ్రామస్థులు తిప్పికొట్టారు. పైగా ఇది పట్టణానికి చెందిన హిందువుల మనోభావాలకు సంబంధించిన సున్నితమైన అంశమని వివాదం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. దీంతో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఆర్టీసీ విజిలెన్స్ విభాగం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఎం రాజశేఖర్, డీఎస్పీ మహంకాళి రామ్మూర్తి, సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ కలిసి స్థానికులు దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, రాధారపు బిక్షపతి, ఇడుకుళ్ల బిక్షమయ్య, లింగాల రాములు, మిర్యాల రాములు, ఐతరాజు యాదయ్య, జెరిపోతుల భరత్, వేముల సత్యం, మేడబోయిన శ్రీనివాస్‌లతో చర్చలు జరిపారు. చివరకు ఈ సమస్యను ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు దృష్టికి తీసుకెళ్లగా రోడ్డు వెడల్పులో పోగా మిగిలిన దసరా గుడి స్థలాన్ని ఇచ్చేందుకు ఎండీ అంగీకరించడంతో వివాదానికి తెరపడింది.

వృద్ధుడిని కాపాడిన పోలీసులు

● కుటుంబసభ్యులకు అప్పగింత

నాగార్జునసాగర్, సెప్టెంబరు 27: నాగార్జునసాగర్ కొత్త వంతెన పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన వృద్ధుడిని శుక్రవారం సాగర్ పోలీసులు కాపాడి కుటుంబసభ్యులకు అప్పగించారు. సాగర్ ఎస్ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా హాలియా పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దొడ్డి పాండరయ్య (85) అనే వృద్ధుడు మతిస్థిమితం లేకపోవడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సాగర్‌కు బస్సులో వచ్చి పైలాన్‌కాలనీ కొత్త వంతెన పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ తమ సిబ్బందితో అక్కడకు చేరుకొని వృద్ధుడిని కాపాడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కౌన్సిలింగ్ ఇచ్చిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.


వృద్ధుడు పాండరయ్యను
కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్ఐ సంపత్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

● మరో యువకుడికి తీవ్రగాయాలు ● ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు ● మునుగోడు మండలంలో ప్రమాదం


నాగరాజు (ఫైల్)


ఆంజనేయులు (ఫైల్)

మునుగోడు, సెప్టెంబరు 27: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా మునుగోడు శివారులోని కోడెమారు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మునుగోడు మండల కేంద్రానికి చెందిన రేవెల్లి నాగరాజు (19) అనే యువకుడు చొల్లేడు వెపు నుంచి ఓ ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. మర్రిగూడెం మండలం నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కీలుకత్తి ఆంజనేయులు (23), బొమ్మనగోని నరేష్ మరో ద్విచక్రవాహనంపై మునుగోడు వైపు నుంచి తమ స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో చొల్లేడు రోడ్డులోని మునుగోడు శివారులోని కోడెమారు సమీపంలో ఇరువురి వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న ముగ్గురు యువకులు రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడిపోయారు. ప్రమాదంలో రేవెల్లి నాగరాజు, కీలుకత్తి ఆంజనేయులు అనే ఇద్దరు యువకుల తలలతో పాటు శరీరంపై తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బొమ్మనబోయిన నరేష్ అనే యు వకుడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, రోడ్డు వెంట వెళ్లే ఇతర వాహనాదారులు 108సమాచారం అందించారు. తీవ్రగాయాలైన గురైన నరేష్‌ను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని ప్రమాద జరిగిన తీరును పరిశీలించారు. మృతుల వివరాలు తెలుసుకొన్న అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రమాదం ఘటనతో మృతుల గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

విద్యుత్ వైర్లు చోరీ చేసిన వ్యక్తుల అరెస్ట్


పట్టుబడిన సామగ్రితో నిందితులు

కోదాడరూరల్, సెప్టెంబర్ 27: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని తొగర్రాయి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ తీగలు, సామగ్రి, కేబుల్స్ చోరీ చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి కోదాడ మున్సిఫ్ కోర్టులో హాజరుపరిచినట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన వరదల వల్ల విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయి, కరెంట్ స్తంభాలు తెగిపోయి మండలంలో భారీ నష్టం జరిగింది. కొట్టుకుపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు, వాటికి విద్యుత్ తీగలు లాగేందుకు తీసుకువచ్చిన సామగ్రిని అధికారులు తొగర్రాయి సబ్‌స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ నెల 16వ తేదీ రాత్రి గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామానికి చెందిన దాసరి వంశీ, కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన నామాల వీరబాబు ఇరువురూ కలిసి సబ్‌స్టేషన్‌కు ఉన్న తాళం పగులగొట్టి అందులో 2,200 మీటర్ల వైరు, 321 మీటర్ల కేబుల్ వైరు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున ఆ సామగ్రిని విజయవాడలో విక్రయించేందుకు తొగర్రాయి నుంచి ఆటోలో కరెంట్ వైర్లను తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో నల్లబండగూడెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వారిని పట్టుకుని చోరీ చేసిన వైరు, కేబుల్ వైర్లు, విద్యుత్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 2లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యుత్ ఏడీ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

8 నెలలుగా వేతనాల్లేవ్

» ఆర్థిక ఇబ్బందుల్లో 'ధరణి' ఆపరేటర్లు
» డివిజన్ ఆపరేటర్లకు బదిలీలతో ఇక్కట్లు
» పట్టించుకోని అధికారులు


వేతనాలు విడుదల చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణి ఆపరేటర్లు(ఫైల్)

మిర్యాలగూడ, సెప్టెంబరు 27: ధరణి ఆపరేటర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. 8 నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని పలువురు ఆపరేటర్లు వాపోతున్నారు. వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్న డివిజన్ ఆపరేటర్లపై బదిలీల పిడుగు పడింది. చేతిలో డబ్బులు లేక కొత్త ప్రాంతంలో సెలవులు లేక ఇంటి నుంచి వెళ్లి రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2018లో తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చేసేందుకు ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్‌టీఎస్)లను ఓ ప్రైవేట్ సంస్థ ద్వారా నియమించారు. నల్లగొండ జిల్లాలో 36, సూర్యాపేట జిల్లాలో 26, యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 మంది ఆపరేటర్లను నియమించారు. వారికి ప్రారంభంలో రూ. 9 వేల వేతనం చెల్లించగా ప్రస్తుతం రూ.14,033 వేతనం అందజేస్తున్నారు. కటింగ్‌లు పోను రూ.12 వేలు చేతికి వస్తున్నట్లు పలువురు ఆపరేటర్లు పేర్కొంటున్నారు. అతి తక్కువ వేతనంతో ఆరేళ్లుగా పనిచేస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధరణి ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, భూ సంబంధిత ఫిర్యాదుల టెక్నికల్ పరిష్కారాలు, ఎన్నికల విధులు, ప్రజాపాలన దరఖాస్తులతో పాటు తహసీల్దార్ కేటాయించే ఇతర విధులను కూడా నిర్వర్తిస్తూ బారెడు పనికి మూరెడు జీతంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని కుమిలిపోతున్నారు.

8 నెలలుగా అందని వేతనాలు

గత ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందడం లేదని ఎఫ్‌టీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఒక్కో ఉద్యోగికి నెలవారీగా 29,500 వేతనంగా ప్రైవేట్ ఏజెన్సీకీ చెల్లిస్తున్నా తమకు రూ.12,031 మాత్రమే అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు ఏజెన్సీ గడువు కూడా గత మే నెలలో ముగియడంతో ఇప్పటి వరకు ఎఫ్‌టీఎస్‌ల బాధ్యత మరో ఏజెన్సీకీ అప్పగించకపోవడంతో జీతాల చెల్లింపులు జాప్యం జరుగుతున్నట్లు వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 8 నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని పలువురు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

డివిజన్‌లో ధరణి ఆపరేటర్ల బదిలీలు

డివిజన్‌లోని పది మండలాల ధరణి ఆపరేటర్లను సబ్ కలెక్టర్ నారాయణఅమిత్ బదిలీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొన్ని చోట్ల ధరణి ఆపరేటర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సబ్ కలెక్టర్ డివిజన్ పరిధిలోని వారికి స్థానచలనం కల్పించారు. ఈ నేపథ్యంలో నెలల తరబడి వేతనాలు అందక ఇక్కట్లు పడుతుంటే బదిలీలతో మరిన్ని ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ ప్రక్రియ ఉద్యోగులకు సాధారణమే అయినా కనీసం వేతనాలు అందే వరకైనా బదిలీలు ఆపితే బాగుటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ ప్రయాణ ఖర్చులకు కూడా ఇబ్బందులు ఎదర్కోక తప్పడం లేదని వాపోతున్నారు. ఒకరిద్దరికి మినహా మిగతా వారికి దూరం పెరగడంతో పిల్లలతో మకాం మార్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి



ఏజెన్సీ రద్దయిన తర్వాత వచ్చిన కొత్తగా ఏ ఏజెన్సీ ఇచ్చారో కూడా తెలియదు. ప్రభుత్వం భూమాత పోర్టల్‌ను తీసుకువస్తున్నందున ఉద్యోగ భద్రత కోసం థర్డ్‌పార్టీ ఏజెన్సీని రద్దు చేసి ట్రెజరీ ద్వారా ప్రభుత్వమే నెలనెలా వేతనాలు చెల్లించాలి.

• సిలివేరు హర్ష, ధరణి ఆపరేటర్, వేములపల్లి

కుటుంబ పోషణ భారంగా మారింది



ఫిబ్రవరి నుంచి 9 నెలలుగా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారింది. ఆర్థిక పరిస్థితులతో నెలవారీ ఖర్చులకు కటకట పడాల్సివస్తోంది. ఎఫ్‌టీఎస్‌లను పర్మినెంట్ చేసి ప్రభుత్వమే జీతాలు ఇవ్వాలి.

• అనిల్ ఆపరేటర్, మాడ్గులపల్లి

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఓరియెంటేషన్ కార్యక్రమంలో డీన్, హెచ్‌వోడీలు, కో-ఆర్డినేటర్లు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 27: సమకాలీనమైన మనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లోని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ, దేశ్‌ముఖి బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ లా డీన్ డాక్టర్ కల్నానా కోనేరు అన్నారు. మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీలో బీబీఏ, ఎంబీఏ, ఎంటెక్ ప్రోగ్రాం ప్రారంభోత్సవం, ఓరియెంటేషన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జ్యోతిని వెలిగించి ప్రోగ్రాం ప్రారంభించారు. కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ సునీల్ సంకల, డాక్టర్ శివకుమార్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పొందేందుకు ప్రశ్నాపత్రం విధానం ప్రాముఖ్యాన్ని వివరించారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం -2020ను తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన మొదటి క్యాంపస్ విజ్ఞాన్ వర్సిటీ అని అన్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సరిత సత్పతి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేందుకు విద్యార్థులు నేర్చుకోవాల్సిన నాయకత్వ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ అనిల్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ నాగరాజు, కో-ఆర్డినేటర్, రీసెర్చ్, డెవలప్‌మెంట్ డాక్టర్ అమీనా, విద్యార్థి వ్యవహారాల సమన్వయకర్త డాక్టర్ సయ్యద్ మహబూబ్, డాక్టర్ లాల్రో ఖ్వామా, డాక్టర్ సురేష్‌చంద్ర, డాక్టర్ జాన్‌బాబు, డాక్టర్ అభినవ్, డాక్టర్ హామామ్ సాహెబ్, డాక్టర్ కె అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధిని పెంపొందించుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 27: చేనేత కార్మికులు నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేసి తద్వారా ఉపాధి పెంపొందించుకోవాలని భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని పోచంపల్లి చేనేత సహకార సంఘం 68వ వార్షిక, 66వ మహాసభ సంఘం పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా చేనేత, జౌళి శాఖ డీవో ఏ.శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో కార్మికులనుద్దేశించి ఆమె మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి సభ్యులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ డీవో, సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఏ.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సంఘం సభ్యులు మారుతున్న కాలానుగుణంగా నూతన డిజైన్లతో వస్త్రాలు తయారు చేసి, మార్కెట్లో అమ్ముడుపోయే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో ఎన్‌డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ ఇందిర, చేనేత నాయకులు తడక వెంకటేశం, భారత లవకుమార్, సంఘం మాజీ చైర్మన్ భారత వాసుదేవ్, చేనేత నాయకులు డాక్టర్ సీత సత్యనారాయణ, సూరపల్లి రవీందర్, గంజి కృష్ణ, సంఘం మేనేజర్ రుద్ర అంజనేయులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బీబీనగర్, సెప్టెంబరు 27: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం బీబీనగర్‌లోని మహిళ సమాఖ్య భవన్‌లో ఇందిరా మహిళ శక్తిలో భాగంగా మంజూరైన 42 పెరటి కోళ్ల యూనిట్లను లబ్ధిదారులకు డీఆర్‌డీవో నాగిరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. డీఆర్‌డీవో నాగిరెడ్డి, ఎండివో శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

జూడో పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి రజత పతకం

మోత్కూరు, సెప్టెంబరు 27: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హన్మకొండలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో మోత్కూరు కస్తూర్బా (కేజీబీవీ) జూనియర్ కళాశాలకు చెందిన కె.అలేఖ్య 44 కేజీల బరువు విభాగంలో రజత పతకం సాధించింది. ఆమెను శుక్రవారం ఎంఈవో గోపాల్‌రెడ్డి సన్మానించారు. అనంతరం ఎంఈవో గోపాల్‌రెడ్డిని కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాల ఎస్‌వో సీహెచ్.యాదమ్మ, జూడో కోచ్ అన్నెపు వెంకట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న నాయకులు

గుండాల, సెప్టెంబరు 27: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవనబోయిన అయిలయ్య అన్నారు. శుక్రవారం గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వాటర్ ప్లాంటును అందజేశారు. పాఠశాలలో విద్యార్థులు త్రాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల ఉపాధ్యాయులు దేవనబోయిన అయిలయ్య దృష్టికి తీసుకువెళ్లగా వాటర్ ప్లాంటును ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు వాటర్ ప్లాంటును అందజేశారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పాఠశాల పూర్వ విద్యార్థులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు కృషి చేయాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏలూరి రాంరెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు షర్ఫుద్దీన్, మాజీ ఎంపీపీ ద్యాప కృష్ణారెడ్డి, అన్నెపర్తి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

బీబీనగర్, సెప్టెంబరు 27: స్థానికంగా ఉన్న పరిశ్రమలో స్థానిక నిరుద్యోగ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు. బీబీనగర్ మండల కేంద్రంలో జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రాయితీలు పొంది స్థాపిస్తున్న పరిశ్రమల యాజమాన్యాలు తక్కువ వేతనాలతో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను నియమించుకుంటున్నాయని అన్నారు. స్థానిక యువకులకు అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఉన్నత చదువులు చదివిన స్థానిక యువత ఉపాధి ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించి స్థానికులకు అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మురుగునీరు వెళ్లే కాల్వ ఏదీ?

- ఇబ్బందిపడుతున్న హైవే కాలనీ ప్రజలు
- మంత్రి హామీ ఇచ్చినా.. సమస్య అలాగే

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 27: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని మూడో వార్డు (లింగోజీ గూడ) పరిధిలోని హైవే కాలనీ మురుగు నీటి కూపాన్ని తలపిస్తోంది. కాలనీలోని రెండు ప్రాంతాల్లో మురుగు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. నాలుగైదు సంవత్సరాలుగా మురుగు నీటి సమస్య కాలనీ వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గతంలో మాదిరి వ్యవసాయ భూముల నుంచి మురుగు నీరు దిగువకు వెళ్లకుండ రైతులు అడ్డుకట్ట వేయడంతో నీటి నిల్వలు పెరిగి దుర్గంధం వ్యాపిస్తోంది. ఇళ్ల చుట్టూ ఉన్న మురుగు కాల్వల్లో మురుగు నీటి నిల్వలు పేరుకుపోవడంతో కొన్ని ఇళ్ల నుంచి మురుగు నీరు బయటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిసిన సమయాలలో దుర్గంధం భయంకరంగా వ్యాపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో 65వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ఈ కాలనీ మురుగు నీటికి నిలయంగా మారింది. పేరు కు హైవే కాలనీ.. కానీ వాస్తవ పరిస్థితిలో మాత్రం మురుగు నీటి కాలనీగా దర్శనమిస్తోంది. హైవేకు ఉత్తరం వైపు ఉన్న ఇళ్ల (హైవే కాలనీ పార్ట్ 1) నుంచి వెలువడే మురుగు నీరు సైతం దక్షిణ భాగం వైపు ఉన్న ఈ (హైవే కాలనీ పార్ట్ 2) కాలనీలోకి చేరుకుంటోంది. దీంతో మొత్తం కాలనీకి చెందిన మురుగు నీరంతా ఒకే దగ్గరకు చేరుకుంటోంది. అందులోనూ ఈ ప్రాంతం నుంచి మురుగు నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇళ్ల చుట్టు నిలిచి పెద్ద పెద్ద కుంటలుగా మారిపోయాయి. ఈ సమస్యతో దోమల బెడద అధికం కావడంతో పాటు మురుగు నీటి దుర్గంధం ప్రబలి విష జ్వరాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. మురుగు నీటి గుంతల్లో విష పురుగులు సంచరించరిస్తూ.. అప్పుడప్పుడు ఇళ్లలోకి చొరబడుతున్నాయని కాలనీ వాసులు పేర్కొంటున్నారు.





హైవే కాలనీలో చెరువులను తలపిస్తున్న మురుగు నీరు



ఇళ్ల మధ్య నిలిచిన నీరు

సమస్య జఠిలంగా ఎందుకు మారిందంటే..?

కాలనీ చుట్టూ వ్యవసాయ భూములు ఉండడంతో మురుగు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో కాలనీ చుట్టూ మురుగు నీరు నిలిచింది. వ్యవసాయ భూముల నుంచి మురుగు నీటి కాలువలను నిర్మించేందుకు రైతులు వ్యతిరేకిస్తుండడంతో సమస్య జఠిలంగా మారింది. మురుగు నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు చొరవ చూపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మంత్రులే హామీ ఇచ్చినా..

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా 2022 డిసెంబరు 7వ తేదీన జరిగిన లింగోజీగూడ ఇంచార్జ్‌గా ఉన్న అప్పటి ఆబ్కారీ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కాలనీలో పర్యటించి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ ఉప ఎన్నికలో గెలిచిన కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విజయం సాధించినా సమస్య అలాగే ఉంది. అనంతరం సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

మురుగు నీటితో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం



మురుగు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. హైవేకు ఉత్తర బాగంలోని ఇళ్లకు చెందిన మురుగు నీరు సైతం దక్షిణ భాగంలోని ఇళ్ల వద్ద కు చేరి పెద్ద పెద్ద గుంటలుగా ఏర్పడ్డాయి. ఈ మురుగు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేక పోవడంతో దర్వాసన భరించలేకపోతున్నాం. దోమల బెడద ఎక్కువైంది. అనారోగ్యానికి గురవుతున్నాం. మురుగు నీటి సమస్య నుంచి విముక్తి కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

-ఎర్రగోని లింగస్వామి యాదవ్, హైవే కాలనీ వాసి, లింగోజీగూడ

మురుగు నీటి సమస్యపై కౌన్సిల్‌లో చర్చిస్తాం



మునిసిపాలిటీలోని 3వ వార్డులోని హైవే కాలనీలో నెలకొన్న మురుగు నీటి సమస్యపై కౌన్సిల్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించేందుకు మునిసిపాలిటీ కృషి చేస్తుంది. అందుకు ప్రజలు సహకరించాలి.

-కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

నిస్వార్థ సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: నిస్వార్థ ప్రజా సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా బాపూజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘన నివాళులర్పించారు. ఆలేరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత వేర్వేరుగా నివాళులర్పించారు.



ఆలేరులో లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

- మోత్కూరులో ఎమ్మెల్యే మందుల సామేల్, మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీ నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, నాయకులు కంచర్ల యాదగిరి రెడ్డి, గుండగోని రామచంద్రు, డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, మెంట నగేష్, అన్నెపు పద్మ, పాశికంటి లక్ష్మీనర్సయ్య, ఎంపీడీవో ఎండి.నిరంజన్, ఏపీవో కరుణాకర్, పోచం సోమయ్య, కూరపాటి రాములు, చుంచు లక్ష్మయ్య, యాదయ్య పాల్గొన్నారు.



మోత్కూరులో బాపూజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

- భువనగిరిలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి.రామాంజలరెడ్డి, కౌన్సిలర్ ఖైరంకొండ వెంకటేశ్వర్లు, సంఘం అధ్యక్షుడు బింగి భిక్షపతి, నర్సింహ పాల్గొన్నారు.
- భూదాన్‌పోచంపల్లిలో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, గాంధీ గ్లోబెల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్నా రాజేందర్‌రెడ్డి, వినోబా సేవాసంఘం ప్రతినిధులు ఏలె భిక్షపతి, కొయ్యడ నర్సింహగౌడ్, వేశాల మురళి, కర్నాటి అంజమ్మ, గౌడ సంఘం మండల అధ్యక్షుడు గునిగంటి మల్లేష్ గౌడ్, రజక సంఘం అధ్యక్షుడు చేరాల నర్సింహ పాల్గొన్నారు.
- చౌటుప్పల్‌లో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, టీడీపీ, బీజేపీ మునుగోడు అసెంబ్లీ ఇంచార్జ్‌లు బడుగు లక్ష్మయ్య, దూడల బిక్షంగౌడ్, ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, ఏఎంసీ సెక్రటరీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.
- సంస్థాన్ నారాయణపురంలో విగ్రహ కమిటీ నాయకులు సూరేపల్లి శివాజీ, వంగరి రఘు, సూరేపల్లి వెంకటేశం, సంగిశెట్టి తిరుమలేశ, మేకని రామకృష్ణ, సూరేపల్లి జవహర్, సూరేపల్లి జనార్దన్, వీడెం వెంకటేశం, సంగిశెట్టి లక్ష్మీనారాయణ, సోలాపురం వెంకటేశం, సత్యనారాయణ, సాయికిషోర్ పాల్గొన్నారు.
- రాజాపేటలో నాయకులు జూకంటి ప్రవీణ్, బోగ జ్ఞానేందర్, గోవర్ధన్, ఉప్పలయ్య, సిద్దులు, సంతోష్ పాల్గొన్నారు.
- ఆత్మకూరు(ఎం)లో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు ఎలగందుల మహేష్, ఎంపీడీవో జె.రాములునాయక్, సీనియర్ అసిస్టెంట్ సురేందరరెడ్డి, సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీవో రమేష్, నోముల యాదగిరి, పురుషోత్తం, శంకరయ్య, శ్రీనివాస్, బిక్షపతి, జ్ఞానేశ్వర్, లింగయ్య పాల్గొన్నారు.
- అడ్డగూడూరులో తహసీల్దార్ శేషగిరిరావు, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.
- వలిగొండ మండలంలో మండల స్పెషల్ ఆఫీసర్ జగన్నాథరావు, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, నాయకులు యుగేందర్ రెడ్డి, నరహరి, సత్యనారాయణ, శంకరయ్య, యాదగిరి, బాల్‌నర్సింహ, రామ్‌చందర్, పవన్‌కుమార్, నర్సింహ పాల్గొన్నారు.



వలిగొండ: బాపూజీ జయంతి వేడుకలో మండల ప్రత్యేకాధికారి జగన్నాథరావు

గ్రామాలను పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవాలి



శేరిల్లలో సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్/ చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 27: మునిసిపాలిటీతో పాటు మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని అన్ని రకాల విద్యుత్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ట్రాన్స్ కో యాదాద్రి భువనగిరి ఎస్ఈ సుధీర్ బాబు, చౌటుప్పల్ డీఇ విజయ భాస్కర్ రెడ్డి, ఏడీఈ శ్యాం కుమార్, ఏఈ సతీష్‌తో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. చౌటుప్పల్ మునిసిపాలిటీ, చౌటుప్పల్ రూరల్, సంస్థాన్ నారాయణ పురం మండలాల్లో జరుగుతున్న విద్యుత్ పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రూ.20 కోట్ల తో మునిసిపాలిటీతో పాటు గ్రామాలలో ఏ రకమైన పనులను చేపట్టే విషయాలపై అధికారులకు ఎమ్మెల్యే నిర్దేశం చేశారు. విద్యుత్ లైన్ల మార్పిడి, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లూజ్ లైన్లను సరిచేయడం, సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటి పెంపు తదితర పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ పనులతో పాటు గ్రామాల్లో నెలకొన్న అత్యవసర పనులను గుర్తించి వెంట వెంటనే పరిష్కరించాలని కోరారు. అత్యవసర పనులను అన్ని గ్రామాల్లో చేపట్టాలని, పైలట్ ప్రాజెక్ట్ పేరుతో మిగిలిన గ్రామాల సమస్యలపై నిర్లక్ష్యం చేయకూడదని ఎమ్మెల్యే సూచించారు. చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జ్ చిల్కూరీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మండలంలోని శేరిల్లలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు.

జమ్మిచెట్లను విరివిగా నాటాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

భువనగిరి గంజ్, సెప్టెంబరు 27: ప్రతీ గ్రామంలోనూ, ఆలయంలోనూ ఒక జమ్మిచెట్టు నాటాలని మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భువనగిరి పరిధిలోని స్వర్ణగిరి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జమ్మి వృక్షాన్ని నాటారు. ఊరికో జమ్మిచెట్టు.. ఆలయానికో జమ్మిచెట్టు అనే కార్యక్ర వాల్‌పోస్టర్‌ను స్వర్ణగిరి ఆలయ ధర్మకర్త మానేపల్లి రామారావు, మాజీ ఎంపీతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసర పండుగ సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఆధ్వర్యంలో జమ్మిని చెట్లను ప్రతీ ఊరిలో, గుడిలో నాటుతున్నామని తెలిపారు.

అన్ని రంగాల్లో అభివృద్దే లక్ష్యం: ఎమ్మెల్యే

ఆలేరు రూరల్, సెప్టెంబరు 27: ఆలేరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం అమృత్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, కౌన్సిలర్లు చింతల ఫణి, సునీత, నాయకులు వెంకటేశ్వర్‌రాజు, ఎంఏ.ఎజాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరోగమనంలోకి వెళుతున్న తెలంగాణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీత

ఆలేరు రూరల్, సెప్టెంబరు 27: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళుతోందని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. శుక్రవారం ఆలేరులోని రహదారి బంగ్లాలో ఆమె మాట్లాడారు. భూధాన్‌పోచంపల్లికి మంజూరైన ఐఐహెచ్‌టీని రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌కు తరలించడం సరైంది కాదన్నారు. ఆ ఇన్‌స్టిట్యూట్‌ను పోచంపల్లిలోనే ఏర్పాటు చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ ఆత్మకు శాంతి చేకూర్చాలన్నారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం చొరవ తీసుకుని ఐఐహెచ్‌టీని పోచంపల్లిలో ఏర్పాటు చేయాలన్నారు. మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పీఏసీఎస్ చైర్మన్ మొగులగాని మల్లేశం, కౌన్సిలర్లు బేతి రాములు జూకంటి శ్రీకాంత్, బీఆర్‌ఎస్ నాయకులు పుట్ట మల్లేష్, కావ్యశ్రీ, రామనర్సయ్య, పరమేశ్వర్, మురళి, బాలస్వామి, బింగి రవి, నర్సింహులు, వెంకటేష్, సంపత్ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 27: ఎన్నికల హామీలను అమలు చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి విమర్శించారు. చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం చౌటుప్పల్ మునిసిపాలిటీ, చౌటుప్పల్ రూరల్, సంస్థాన్ నారాయణపురం మండలాల బీజేపీ సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, రైతులకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదని, సీజన్ మారుతున్నా రైతు బంధు వేయలేదని ఆయన అన్నారు. సమావేశంలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, నాయకులు తూళ్ల వీరేందర్‌గౌడ్, దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, పట్టణ మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, మల్లేశం, కౌన్సిలర్ పి. శ్రీధర్ బాబు, ముత్యాల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

భువనగిరి టౌన్ : పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మునిసిపల్ కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కార్మికులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని కడపగండి తండాకు చెందిన మాజీ సర్పంచ్ కరంటోతు శంకర్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు శంకర్‌నాయక్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. మొత్తం రూ.80వేలను బాధిత కుటుంబ సభ్యులకు సాయంగా అందజేశారు.

రామన్నపేట : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరి పంట రుణాలను మాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. మండలం సిరిపురంలోలో ఆయన మాట్లాడారు.

రామన్నపేట : గొల్నేపల్లి- గుండ్రాంపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మించాలలని సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మండల ప్రత్యేక అధికారి ఆర్‌టీసీ ఆర్‌ఎం రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు వనం ఉపేందర్, నర్సింహాచారి, అవనగంటి నగేష్, స్వామి, రాజలింగం, నవీన్, భిక్షం పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం ఉదయం 10 నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ జయరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ కోసం కోర్టుల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

భువనగిరి టౌన్: ఇరిగేషన్ శాఖ ఏఈఈగా భువనగిరి హనుమాన్‌వాడకు చెందిన బండ సాయి వినిత్ ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నాడు.

భువనగిరి టౌన్: ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో 25 కిలోల విభాగంలో మోత్కూరుకు చెందిన కిరణ్ స్వర్ణ పతకం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు కాంస్య, రజత పతకాలు సాధించినట్లు తెలిపారు. కోచ్‌లుగా లావణ్య, వెంకటేష్, వ్యవహరించారు.

భువనగిరి రూరల్: పంటల సాగులో రైతులు మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌కుమార్, భువనగిరి వ్యవసాయ సహాయ సంచాలకుడు బి వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరి మండలం బొల్లేపల్లి రైతు వేదికలో పంటల సమగ్ర సస్యరక్షణ అనే అంశంపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

భువనగిరి రూరల్: దసరా మహోత్సవాల సందర్భంగా అక్టోబరు 13వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీచక్ర మహా ఆలయం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని సిద్దగురు రమణానంద మహర్షి తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులోని శివశక్తి శిర్డీసాయి అనుగ్రహ పీఠం రమణేశ్వరంలో ఆయన మాట్లాడారు.

భువనగిరి రూరల్: గ్రామస్థుల రవాణా సౌకర్యాన్ని మెరుగు పరిచేందుకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్టీసీ బస్సును గ్రామస్థులు ప్రారంభించారు. భువనగిరి మండలం వీరవెల్లి నుంచి వయా చందుపట్ల, బండసోమారం టూ మేడ్చల్ జిల్లా ఉప్పల్ వరకు ఉప్పల్ బస్ డిపోను పునరుద్ధరించారు.

బీబీనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోళి పింగల్‌రెడ్డి అన్నారు. మండలంలోని భట్టు గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 68వ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాల్లో ఆయన మాట్లాడారు.

ఆత్మకూరు(ఎం) : జమిలి ఎన్నికల విధానానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం సమంజసం కాదని సీపీఎం మండల కార్యదర్శి వేముల బిక్షం అన్నారు. మండలంలోని తుక్కాపురంలో సీపీఎం గ్రామ మహాసభలో ఆయన మాట్లాడారు. నాయకులు మల్లెల శ్రీశైలం, పాపయ్య, చంద్రయ్య, అభిలాష్, లావణ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కె.మహదేవరెడ్డి (ఎఫ్‌ఏసీ)ని మండల విద్యాధికారిగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో శనివారం జరిగే సింగిల్ విండో సర్వసభ్య సమావేశానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు రానున్నట్లు సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి తెలిపారు.

మోటకొండూరు : మండలంలోని చాడ నుంచి పిట్టలగూడెం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని చాడ మధిర గ్రామం పిట్టలగూడెంలో సీపీఎం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు.

భువనగిరి అర్బన్ : లాడ్జీల నిర్వాహకులు సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్ సూచించారు. యాదగిరిగుట్ట పట్టణ పరిధిలో లాడ్జీల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడారు.

వలిగొండ: ఇళ్లు లేని పేదలందరికీ వెంటనే ఇండ్లను మంజూరు చేయాలని, సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అరూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అంజయ్య, మణెమ్మ పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యాటక రంగంతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని కళాశాల ప్రిన్సిపల్ రహత్ ఖానం అన్నారు.

భువనగిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో ఐటీఐలు బలోపేతం అవుతున్నాయని ఐటీఐ ఆర్‌డీడీ రాజా అన్నారు. భువనగిరిలోని సిద్ధార్థ, శివసాయి ఐటీఐల్లో జరిగిన కాన్వకేషన్‌లో ఆయన మాట్లాడారు.